

విభిన్న ప్రతిభావంతులకు చేయూత

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అల్లూరి సీతారామరాజు పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం విభిన్న ప్రతిభావంతులకు చెవి మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిఆర్ఓ అప్పలనాయుడు, ట్రైబల్ డిసబుల్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ బిబి ధర్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. చెవి లోపంతో బాధపడుతున్న దివ్యాంగులకు ఉచితంగా చెవి మిషన్లు అందజేశారు.దివ్యాంగులు సాధారణ జీవనాన్ని గడపడానికి అవసరమైన సహాయాన్ని అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగించాలని పలువురు కోరారు.



చెవి మిషన్‌ను ఇస్తున్న ప్రెసిడెంట్




అరకులోయలో బైక్ ర్యాలీ చేపడుతున్న సిపిఎం నేతలు సురేంద్ర, కార్మికులు, తదితరులు

ఉత్సాహంగా సిఐటియు మహాసభ ప్రచారం

విశాఖలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకూ జరుగనున్న సిఐటియు అఖిల భారత మహాసభ నేపథ్యంలో శుక్రవారం మన్యంలో ప్రచారం ఉత్సాహంగా సాగింది. పాడేరు, అరకులోయలో భారీ ఎత్తున ర్యాలీలు చేపట్టారు. కొయ్యూరులో కరపత్రాలను పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-పాడేరు:- విశాఖలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహిస్తున్న సిఐటియు అఖిల భారత 18వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణ వీధుల్లో శుక్రవారం వివిధ రంగాల కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ముఠా కార్మిక వర్గాలు కదిలి వచ్చి సిఐటియు జిందాబాద్ నినాదాలతో ఈ ర్యాలీని చేపట్టారు. జనవరి 4న చలో విశాఖ కార్యక్రమంతో కదిలి రావాలని నినదించారు. డిసెంబరు 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జరుగుతున్న సందర్భగా జనవరి 4న వేలాది మందితో జరిగే భారీ ర్యాలీ లో కార్మిక వర్గాలన్నీ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు ఏలూరి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ ర్యాలీలో భాగంగా పాడేరు ఆర్టీసీ డిపో వద్ద సిఐటియు జెండాను కార్మికులతో కలసి జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందర్రావు ఆవిష్కరించారు. అనంతరం కాంప్లెక్స్ నుండి ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కార్పొరేట్లకు ధనవంతులకు మేలు చేసే విధంగా కేంద్రంలో ఉన్న బిజెపి కార్మికుల అణిచి వేసేందుకు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దు చేసి కార్మికుల నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందన్నారు. తక్షణమే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ముఠా, బిల్డింగ్, ఆటో మోటార్ తదితర కార్మికులను అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత మహాసభల్లో ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కార్మికులకు నష్టం చేకూర్చే చట్టాలకు వ్యతిరేకంగా మహాసభలో భవిష్యత్తు పోరాటాలకు దశ దిశా నిర్దేశం జరుగుతుందని తెలిపారు. జనవరి 4న జరిగే భారీ బహిరంగ సభ ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పాడేరు మండల కన్వీనర్ ప్రసాద్, ముఠా కలసిల యూనియన్ నాయకులు రాజు, సూరిబాబు, అప్పలనాయుడు, శంకర్, దాసు పాల్గొన్నారు.



అరకులోయ రూరల్: సిఐటియు అఖిలభారత మహాసభను విజయవంతం చేయాలని, జనవరి 4న విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభకు వేలాది మంది కార్మికులు హాజరై మహాసభను విజయవంతం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు. అరకులోయ మండల కేంద్రంలో శుక్రవారం సిఐటియు జిల్లా కోశాధికారి పోతురాజు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ కి ముఖ్య అతిథిగా కిల్లో సురేంద్ర పాల్గొని మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల జీతాలను పెంచకపోవడం, జీవితాంతం పనిచేసే కార్మికులను తక్కువ వేతనంతో కొనసాగించడం, పర్మినెంట్ చేయక పోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జె. భగత్ రాం, సిపిఎం మండల కార్యదర్శి కే.రామారావు, కిల్లో జగనాదం, బి.ధశరథ్, రాజు, కె.అర్జున్ డొంబు, వి. ప్రసాద్ పాల్గొన్నారు.

కొయ్యూరు: జనవరి 4వ తేదీన జరుగు సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు మండల నాయకుడు సూరిబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో కరపత్రాలు పంచారు. అనంతరం మాట్లాడుతూ ఐక్య పోరాటం నినాదంతో అన్ని సమరశీల పోరాటాల్లో సిఐటియు అగ్రభాగాన ఉందన్నారు. దేశవ్యాప్తంగా యావత్తు కార్మిక వర్గాన్ని ఐక్యపరచడం సిఐటియు ఆశయమని అన్నారు. కార్మిక కర్షక ఐక్యతతో పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చి కార్మిక రాజ్యాంగాన్ని స్థాపించడం సిఐటియు లక్ష్యమని పిలుపునిచ్చారు.



పాడేరులో ర్యాలీ చేపడుతున్న కార్మికులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బైక్‌ను ఢీకొట్టిన బొలెరో వాహనం

క్షతగాత్రులకు సీలేరు పిహెచ్‌సిలో చికిత్స అనంతరం విశాఖ కెజిహెచ్‌కు తరలింపు

డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నాం : ఎస్ఐ యాసీన్

ప్రజాశక్తి- సీలేరు: బొలెరొ, బైక్ ఢీకొట్టిన సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జికె వీధి మండలం సీలేరు పంచాయతీ పార్వతినగర్‌లో క్రిస్మస్ వేడుకలకు ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ముంచంగిపుట్టు మండలం బూసిపుట్టి పంచాయతీ పిట్టగెడ్డ గ్రామానికి చెందిన గొల్లూరి అనిత (18) దారకొండ పంచాయతీ పట్టమర్రి గ్రామానికి చెందిన వంతల రుత్తు (20) తన చెల్లెలు వంతల సిరమ (19) వీరు ముగ్గురూ గురువారం పార్వతినగర్ వారి బంధువుల ఇంటికి వెళ్లి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ఆనందంగా గడిపారు. శుక్రవారం ఉదయం పార్వతి నగర్‌లో వీరు ముగ్గురు ద్విచక్రవాహనంపై బయలుదేరి వెళ్తుండగా సీలేరుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఎర్రదిబ్బల ప్రధాన రహదారి వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం రాంగ్‌రూట్లో వస్తూ వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు యువతులకు కుడికాళ్లు విరిగిపో యాయి. బైక్ నడుపుతున్న వంతల రుత్తుకు తలకి, కుడిచేయి మణికట్టు వద్ద తీవ్రగాయాలయ్యాయి. రోడ్డుపై తీవ్ర రక్తస్రావమై పడి ఉన్న వీరిని భద్రాచలం వయా సీలేరు మీదుగా విశాఖ వెళ్తున్న ఆర్టీసి బస్సులో ప్రయాణికులు గమనించి బస్సును ఆపాలని డ్రైవర్‌కి చెప్పి బస్సు ఆపారు. ప్రయాణికులు స్థానిక టిడిపి నాయకులు ఓదురు గోవింద్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే ఎపి జెన్‌కో భవ్య హెల్త్ సర్వీసెస్ ఆసుపత్రి సిబ్బందికి, పిహెచ్‌సి సిబ్బందికి అప్రమత్తం చేశారు. భవ్య హెల్త్ సర్వీసెస్ నిర్వాహకులు వినోద్ వెంటనే స్పందించి అప్రమత్తం చేసి సిఎస్ఆర్ సిబ్బందికి తెలిపారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని ముగ్గురికి ప్రథమ చికిత్స చేసి సీలేరు పిహెచ్‌సికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స అందించేందుకు విశాఖ కేజిహెచ్‌కి రిఫర్ చేశారు. ఎస్ఐ యాసీన్ విలేకరులతో మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా చిత్ర కొండ నుంచి బొలెరో వాహనం వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని, బొలెరో వాహనం నడుపుతున్న డ్రైవర్ తప్పిదం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్టు ధ్రువీకరించామన్నారు. గాయపడిన వారి బంధువుల ఫిర్యాదు మేరకు బొలెరో వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



గాయపడిన అనిత, వంతల సిరమ



గాయపడిన వంతల రుత్తు

'పల్లా' దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు దృష్టికి నియోజకవర్గ సమస్యలు గురించి విన్నవించినట్టు రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్ తెలిపారు. విశాఖపట్నంలోని పల్లా శ్రీనివాసరావు కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలపై వివరించారు. ముఖ్యంగా టెండర్ పనుల వలన నియోజకవర్గంలో చాలా ఇబ్బందిగా ఉందన్నారు. పార్టీని నమ్ముకుని ఉన్నవారికి బలోపేతం చేసే విధంగా నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. రంపచోడవరం నియోజకవర్గానికి ఒకసారి రావాలని కోరారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



పల్లా శ్రీనివాసరావును కలిసిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, విజయభాస్కర్

మౌలిక వసతులు కల్పించకపోతే ఆందోళన

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

టేకులూరులో పర్యటించిన ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు



పర్యటిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సోయం చిన్నబాబు, సంతోష్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి- విఆర్‌పురం: మండలంలోని కుందులూరి పంచాయతీ టేకులూరులో శుక్రవారం ఎంపిపి కారం లక్ష్మితో పాటు సిపిఎం నాయకులు పర్యటించారు. ఈ నెల 25న 'దారి చూపే నాథుడేడీ? శీర్షికన టేకులూరు రహదారిపై ప్రచురితమైన కథనానికి స్పందించి గ్రామంలో తాగునీటి సౌకర్యం, రహదారి పరిశీలించారు. ఈ సందర్భం గా గ్రామస్తులు మాట్లాడుతూ తరాలు మారినా అభివృద్ధికి నోచుకో లేదని, కొండరెడ్ల గ్రామాలకు ఇప్పటికీ తాగునీరు అందడం లేదని, కాలిబాట కంటే అధ్వానంగా టేకులూరు దారి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంపిపి కారంలక్ష్మి, సిపిఎం నాయకులు స్పందిస్తూ తక్షణమే కుందులూరు నుంచి టేకులూరి వరకు రహదారి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. టేకులూరు గ్రామానికి విద్య, వైద్యం అందాలన్నా ముందు గ్రామాలకు రవాణా రహదారి సౌకర్యాలు ఉండాలి అప్పుడే సమగ్ర గిరిజన అభివృద్ధి అవుతుందని, ఐటిడిఎ ప్రత్యేక నిధులు వెచ్చించి ఈ గ్రామానికి కనీసం తాగునీరు, సింగిల్ బీటీ రహదారి అయినా నిర్మించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, మండల కార్యదర్శివర్గ సభ్యులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, మండల కమిటీ సభ్యులు పోడియం శ్రీరామ్మూర్తి, వడ్లాది రమేష్, కమచిచ్చు సత్యనారాయణ, సిరప్ తాతబాబు, సోడి మల్లయ్య, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రెగ్యులర్ వైద్యాధికారులను నియమించాలి



ఆసుపత్రి ముందు నిరసన తెలుపుతున్న పీసా కమిటీ నాయకులు

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం సీలేరు పిహెచ్‌సికి రెగ్యులర్ వైద్యాధికారులను నియమించాలని పీసా కమిటి ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. గిరిజనులతో కలసి ప్రభుత్వ ఆసుపత్రి ముందు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు ప్రభుత్వ ఆస్పత్రి 24 గంటల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి రెగ్యులర్ వైద్యాధికారులను నియమించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల డిప్యూటేషన్ ప్రాతిపదికన వైద్యాధికారి నారాయణరావు, మరో వైద్యాధికారిని సీలేరు పిహెచ్‌సికి నియమించారని ఒక్కొక్కరు వారం రోజుల చొప్పున విధులు చేపట్టాలని అధికారులు ఆదేశించారన్నారు. శుక్రవారం జరిగిన ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయని, వారిని తీసుకొచ్చిన సమయంలో వైద్యాధికారులు అందుబాటులో లేరని, ఎపి జెన్‌కో ఆధ్వర్యంలో నడుస్తున్న భవ్య హెల్త్ సర్వీసెస్ వైద్యాధికారి అఖిల్ సిబ్బంది వైద్యసేవలందించారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రెగ్యులర్ వైద్యాధికారులను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రంపచోడవరం వైటిసి వద్ద ఈనెల 27న శనివారం నిర్వహించే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరావు శుక్రవారం తెలిపారు. 18ఏళ్లు నిండి, ఐదో తరగతి నుంచి పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, బిటెక్ ఇతర విదార్హతలు కలిగిన నిరుద్యోగ యువతకు1,230 ఉద్యోగాల భర్తీకి నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. రాజమండ్రి, కాకినాడ, శ్రీసిటీ, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్,విశాఖపట్నం తదితర నగరాల్లో నియమాకాలకు సంబంధించి సంబంధిత కంపెనీల ప్రతినిధులు ఎంపికలు చేపడతారని తెలిపారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సాహించాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సూచించారు.



మాట్లాడుతున్న మండల సిపిఐ కార్యదర్శి ఉల్లి సూరిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు దేముడు

ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవం


ప్రజాశక్తి - కొయ్యూరు: బడుగు, బలహీనవర్గాల వారి కోసం పనిచేసిన పార్టీ సిపిఐ అని కొయ్యూరు మండల సిపిఐ కార్యదర్శి ఉల్లి సూరిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇరువాడ దేముడు అన్నారు. రాజేంద్రపాలెంలో సిపిఐ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ అనేక ఉద్యమాలు చేసి కొండపోడు పట్టాలు పేద గిరిజన రైతులకు ఇప్పించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక అధ్యక్షులు వియ్యపు నానాజీ, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ధన్యంరాజు కనకరాజు, గిరిజన సమాఖ్య మండల నేత పొటుకూరి దార్ల మల్లేష్, సిపిఐ నాయకులు గుమ్మ రాంబాబు, గండేపల్లి నూకరాజు, మాదాల సత్యనారాయణ, కె.రమేష్, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: దూసరిపాములో ఈ నెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన మాగాపు సూరిబాబు (55) తీవ్రంగా గాయపడ్డాడు. తొలుత రాజవొమ్మంగి పిహెచ్‌సిలో ప్రథమచికిత్స అందించి అనంతరం కాకినాడ రిఫర్ చేశారు అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

15 ఏళ్లుగా అసంపూర్తిగా రహదారి

- పనులు పూర్తి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతల నిరసన



నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి అరకులోయ రూరల్:అరకులోయ మండలంలోని మాదల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతానికి కీలకమైన దాబుగుడ రహదారి దయనీయ స్థితిలో ఉందని, సుమారు 15 సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఈ రహదారి ఇప్పటికీ పూర్తి కాక పోవడంతో ఆదివాసీ గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదివాసి గిరిజన సంఘం పంచాయితీ నాయకులు కుమిడి రమేష్ అన్నారు. శుక్రవారం వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ సందరరేగా ఆదివాసీ గిరిజన సంఘం పంచాయితీ నాయకులు కుమిడి రమేష్ ఆధ్వర్యంలో మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించిన ఈ రోడ్డు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నత్తనడకన సాగుతోందని ఆరోపించారు. రవాణా సౌకర్యాలు లేక మధ్యమార్గంలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా జరిగాయని వారు గుర్తు చేశారు. ప్రభుత్వం లోతేరు రోడ్డు జంక్షన్ నుండి కమలతోట గ్రామం వరకు సుమారు 17 కిలోమీటర్ల రహదారిని మంజూరు చేసినప్పటికీ, పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి రహదారి పనులను తక్షణమే ప్రారంభించి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గిరిజనులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎస్ సోన్ను, రాము, దేముడు, అర్జున్, లంబన్న, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాలి

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:హైదరాబాద్‌లో ఈ నెలలో జరిగిన 32వ ఎన్ టి పి సి సీనియర్ ఇండియన్ రౌండ్ మెన్ అండ్ వుమెన్ జాతీయ స్థాయి విలువిద్య పోటీలలో పాల్గొని టీమ్ విభాగంలో బంగారు పతకాలు సాధించిన గిరిజన విలువైన విలువిద్య క్రీడాకారులు సొలగం సాంబ శివ,మొదమాంబ హై లో 10వ తరగతి చదువుతున్న సిహెచ్.మోహిత్ సాయి, సోడే దేశయ్యను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అభినందించారు. ఈన 31 నుండి ఛత్తీష్‌గఢ్ రాష్ట్రంలోనీ రాయ్పూర్‌లో జరుగుతున్న 45వ ఎన్‌టిపిసి జూనియర్ ఇండియన్ రౌండ్ బాయ్స్ అండ్ గర్ల్స్ విభాగంలో సిహెచ్.మోహిత్ సాయి, సోడే దేశయ్య మరింత మెరుగ్గా రాణించి పతకాలు సాధించాలన్నారు. పోటీలలో పాల్గొనడానికి ఆర్థికంగా సహాయం చేసిన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ పాడేరు ఐటిడిఏ పీవో తిరుమణి శ్రీ పూజ, జిల్లా ఇంచార్జ్ రెవెన్యూ అధికారి అంబేద్కర్, పాడేరు ఇంచార్జ్ ఆర్డీవో ఎంవీఎస్ లోకేశ్వరరావు పాడేరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చిట్టిబాబు , జిల్లా క్రీడాభివ ద్ధి అధికారి జగన్మోహన్ ,కోచ్ అడపా సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.



పతాకాన్ని క్రీడాకారుని మెడలో వేస్తున్న కలెక్టర్



దొన్నుదొరకు వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్తులు

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: గిరిజన సమస్యల పరిష్కార వేదికగా ప్రజా వేదిక నిలుస్తోందని ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర అన్నారు. మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రజావేదికను నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో డ్రైనేజీ, వీధిరోడ్లు, తాగునీరు, శాశ్వత రహదారుల కల్పనపై వినతులు వచ్చాయి. ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయంలో గిరిజన ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో గిరిజన గ్రామాల్లో అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం ప్రజావేదికతో మమేకమవుతుందన్నారు. సమస్యల పరిష్కారంతో పాటు గిరిజన ప్రజానీకం అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నదే ప్రభుత్వ కంకణం కట్టుకుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కనీస వేతనాల సలహా మండలి సంఘం రాష్ట్ర డైరెక్టర్ టి సుబ్బారావు, మండల అధ్యక్షుడు ఆనంద్, ఎంపీటీసీ సభ్యురాలు గీత, నాయకులు భాస్కరరావు, సుబ్బారావు రవి, సింహాద్రి పాల్గొన్నారు.

ప్రజల పత్రిక 'ప్రజాశక్తి'

కేలెండర్ ఆవిష్కరణలో ఎంపిడిఒ పూర్ణయ్య



ప్రజాశక్తి కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి-పెదబయలు : ప్రజల సమస్యలను వెలికి తీయడంలో ప్రజాశక్తి పత్రిక ఎప్పుడూ ముందంజలో ఉంటుందని ఎంపిడిఒ ఎల్.పూర్ణయ్య అన్నారు. ప్రజాశక్తి ముద్రించిన 2026 కేలెండర్‌ను మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఎంపీడీఓ ఎల్.పూర్ణయ్య, మండల విద్యాశాఖ అధికారి కొమ్ము కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ కె.రాజుబాబు, గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు మర్రి చెట్టు అప్పారావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎల్.విశ్వనాథం శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఏడాది ప్రజాశక్తి కేలెండర్ అందమైన ఫొటోలతో ప్రచురించి పాఠకులకు అందిస్తూ ప్రజల ఆదరాభిమానాన్ని చూరగొనడం అభినందనీయమన్నారు. గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు మర్రిచెట్టు అప్పారావు మాట్లాడుతూ నీతిగా నిజాయితీగా వార్తలు ప్రచురిస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు సంధాన కర్తగా ప్రజాశక్తి వ్యవహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాశక్తి విలేకర్ల ఫాల్గుణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బస్కి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలి

సిపిఎం నేతల డిమాండ్



మాట్లాడుతున్న దశరథ్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: బస్కి పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, మాజీ ఎంపిటిసి బురిడీ దశరథ్ డిమాండ్ చేశారు.శుక్రవారం అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, బస్కి పంచాయతీ సర్పంచ్ అభివృద్ధి పేరుతో పంచాయతీకి కేటాయించిన నిధులను దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఈ విషయంపై ఈనెల 5న పాడేరులో 'స్పందన మీ కోసం' కార్యక్రమంలో క్లాప్ మిత్రలు, పంచాయతీ ప్రజలు సీపీఎం ఆధ్వర్యంలో ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదును స్వీకరించిన డీపీఓ తక్షణమే విచారణ చేపడతామని హామీ ఇచ్చినా నేటి వరకు ఎలాంటి విచారణ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మండల అభివృద్ధి అధికారికి కూడా ఫిర్యాదు వివరాలు తెలియజేయలేదని విమర్శించారు. పనిచేసిన క్లాప్ మిత్రలకు కూలీ చెల్లించకుండా నిధులు డ్రా చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్లు ఆధారాలతో సహా స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. విచారణాధికారుల నిర్లక్ష్యంపై పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అవినీతిపై చర్యలు తీసుకోకపోతే పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కిల్లో అర్జున్, సమర్ది డొంబు, వంతల ప్రసాద్ పాల్గొన్నారు.

సిపిఎం నేత అప్పలరాజుపై పీడీ యాక్టు అప్రజాస్వామికం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్



మాట్లాడుతున్న సిపిఎం నేత చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి-చింతపల్లి : సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై పీడీ చట్టం నమోదు చేయడాన్ని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు చింతపల్లిలో సిపిఎం మండల కార్యదర్శి ధనుంజయ్, జీకే వీధి మండలం నాయకులు గడుతూరి సత్యనారాయణతో కలిసి శుక్రవారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. నక్కపల్లిలో నిర్మించ తలపెట్టిన బల్క్ డ్రగ్స్ పార్కును వ్యతిరేకిస్తూ ప్రజల తరఫున పోరాడుతున్న అప్పలరాజుపై పీడీ యాక్టు పెట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించడం నీతిమాలిన రాజకీయ విధానమని విమర్శించారు. నేడు బల్క్ డ్రగ్స్ పార్కుకు వ్యతిరేకంగా జరుగు ఉద్యమాన్ని అణచివేసేందుకు పీడీ యాక్టు ప్రయోగించనట్లే రేపు గిరిజన ప్రాంతాల్లో బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా జరిగే ప్రజా ఉద్యమాలపైనా ప్రయోగించే అవకాశం ఉందని, అందువల్ల ప్రజలు ప్రభుత్వ నిరంకుశ చర్యలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అప్పలరాజుపై విధించిన పీడీ చట్టాన్ని వెంటనే బేసరత్తుగా ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

పోటెత్తిన పర్యాటకులు



అనంతగిరి మండలం బొర్రా గుహల వద్ద పర్యాటకులు

ప్రజాశక్తి-చింతపల్లి : ఆంధ్ర కాశ్మీర్‌గా పేరుగాంచిన లంబసింగి ప్రాంతం పర్యాటకులతో కిటకిటలాడుతోంది. ఏజెన్సీ ప్రాంతమంతటా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో పొగమంచు కమ్ముకొని, వణికించే చలితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే ఈ ప్రత్యేక వాతావరణాన్ని ఆస్వాదించేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో లంబసింగికి తరలివస్తున్నారు. తెల్లవారుజామున మంచుతో కప్పబడిన కొండలు, చెట్ల మధ్య ఏర్పడుతున్న పొగమంచు దృశ్యాలు పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. చలి తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ, ఆ సహజ అందాలను కళ్లారా వీక్షించాలనే ఉత్సాహంతో పర్యాటకులు ఉదయాన్నే లంబసింగి పరిసర ప్రాంతాలను సందర్శిస్తున్నారు. ఫొటోలు, సెల్ఫీలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ ఈ ప్రాంత విశేషాలను మరింతగా ప్రచారం చేస్తున్నారు.

పర్యాటకుల రద్దీ పెరగడంతో లంబసింగి, చింతపల్లి పరిసర ప్రాంతాల్లోని రిసార్టులు, లాడ్జీలు, హోమ్‌స్టేలు పూర్తిగా నిండిపోయాయి. ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, భద్రత వంటి అంశాలపై అధికారులు మరింత దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. చలి తీవ్రత మరికొన్ని రోజులు కొనసాగనున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో పర్యాటకుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. లంబసింగి మరోసారి తన 'ఆంధ్ర కాశ్మీర్' పేరును నిజం చేస్తూ, చలికాల పర్యాటక కేంద్రంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

కాశీపట్నం: రెండు రోజులు క్రిస్టమస్ సెలవులు కావడంతో బొర్రా గుహాలు పర్యాటకులతో కిటకిటలాడింది. బొర్రా గుహలను తిలకించడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. తెల్లవారి జాము నుంచి మంచుతో కప్పబడిన కొండల నడుమ, చెట్ల మధ్య పొగమంచు దృశ్యాన్ని పర్యటకులు కెమెరాల్లో బంధించారు..చలి తీవ్రత ఎక్కువగా ఉన్నా బొర్రా గుహలను తిలకించడానికి పర్యాటకులు తరలి వస్తున్నారు. పర్యాటకుల రద్దీ పెరగడంతో స్థానిక వ్యాపారులు, చిరు వ్యాపారాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.అరకు పరిసర ప్రాంతంలో లాడ్జిలు నిండిపోతున్నాయి. బొర్రా జంక్షన్(ములియగుడ) నుంచి బొర్రా గుహాలకు ఆరు కిలోమీటర్ల రోడ్డులో వాహన చోదకులకు ఇక్కట్లు తప్పడం లేదని వాపోతున్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ : పిజిఆర్ఎస్‌కు 86 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 86 వినతులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, ఇంచార్జ్ జెసి ఐటిడిఎ పిఒ శ్రీ పూజ, ఇంచార్జ్ డిఆర్ ఒ అంబేద్కర్, ఇంచార్జ్ ఆర్‌డిఒ ఎంవిఎస్ లోకేశ్వరరావు సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తుందని సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడాలన్నారు. మండల స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించుటలో కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. పిర్యాధుదారునితో మర్యాద పూర్వకముగా వ్యవహరించాలని, ఫిర్యాదును ముగించడంలో ఎటువంటి అత్యుత్సాహం ప్రదర్శించరాదని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. టిడబ్ల్యు డిడి పిబికె పరిమళ, భూగర్భ జలవనరుల శాఖ డిడి డి.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, డిఆర్ డిఎ పిడి వి.మురళీ, డిఎం హెచ్ఒ డాక్టర్ డి.కృష్ణమూర్తి నాయక్, జిల్లా మత్స్య శాఖ అధికారి సూర్యారావు, జిల్లా క్రీడా అభివృద్ధి శాఖ అధికారి జగన్మోహన్‌రావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్.వి.రమణారావు, ఆర్ అండ్ బి ఇఇ బాలసుందరబాబు, గ్రామ వార్డ్ సచివాలయ నోడల్ ఆఫీసర్ పిఎస్ కుమార్, డిపిఒ కె.పి.చంద్ర శేఖర్, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు , డిపిఒ ఎ.జయప్రకాష్, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి ఝాన్సీరామ్ పడాల్, జిల్లా ప్రణాళిక అధికారి పి.ప్రసాద్, ఐటిడిఎ ఎఒ హేమలత, పలువురు ఎంపిడిఒలు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గణేష్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో పాడేరు మండలం దేవాపురం పంచాయితీ సర్పంచ్ కిల్లో పరమేశ్వరీ ఆధ్వర్యంలో కంగెడ్డ, హనుమంతపురం గ్రామాలలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి పెద్ద ఎత్తున వచ్చిన గిరిజనులు, వృద్ధులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కంటి అద్దాలు, దుప్పట్లు, స్థానిక పాఠశాలకు బల్లలు, కుర్చీలు, వాటర్ ఫిల్టర్ పంపిణీ చేశారు. గణేష్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నర్సింగ్‌రావు, రాజు, ఆర్ఎస్ఎస్ సేవా భారతి సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

సైక్లింగ్‌లో రాణించాలి

ప్రజాశక్తి-పాడేరు : సైక్లింగ్ లో మరింత మెరుగ్గా రాణించాలని, జిల్లాలో సైక్లింగ్ పర్యాటకాన్ని ప్రోత్సహించుటకు కొత్త సైక్లింగ్ ట్రాక్‌లను కనిపెట్టాలని జిల్లా సైక్లింగ్ బ్రాండ్ అంబాసిడర్ పెట్టెలి విజయ్ కు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సూచించారు. ఈ ఏడాది అరకు చలి ఉత్సవంలో భాగంగా నిర్వహించిన 36 కిలోమీటర్ల సైక్లింగ్ రేసులో రెండవ స్థానంలో నిలిచినందుకు గాను సైక్లింగ్‌లో మరింతగా ముందుకు వెళ్ళుటకు ప్రోత్సహించడానికి మౌంటెన్ ట్రయల్ బైక్‌ను విజయ్‌కు బాహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ పాడేరు ఐ టి డి ఏ పి ఓ తిరుమణి శ్రీ పూజ, ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్, పాడేరు ఐటడిఏ ఇంచార్జ్ ఆర్డీవో ఎంవీఎస్ లోకేశ్వరరావు, విజయ్ తండ్రి లైబన్, బాబాయ్ ప్రసాదరావు, పర్వతారోహకుడు తేజేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా వీర బాల దివస్



చిన్నారులతో ఉన్న నేతలు, సిబ్బంది

ప్రజాశక్తి-చింతపల్లి : బాలలలో దేశభక్తి, వీరత్వం, ధైర్యం, త్యాగభావాలను పెంపొందించాలనే లక్ష్యంతో లంబసింగి గ్రామ సచివాలయంలో వీర్ బాల్ దివాస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్త సరమండ కుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి లంబసింగి పంచాయతీ సర్పంచ్ కొర్ర శాంతి కుమారి, కిటుముల అంగన్వాడీ సెక్టర్ సూపర్వైజర్ దేపూరు జయభారతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బాలబాలికలు స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొర్ర రఘునాథ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేపూరు గిరిబాబు, పాఠశాల కమిటీ ఛైర్మన్ సరమండ నాగరాజు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వికసిత భారత్ స్కాట్స్ యంగ్ లీడర్స్‌కు ఎయు జాగ్రఫీ పరిశోధక విద్యార్థి



శ్యామ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎయు విసి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం జాగ్రఫీ విభాగపు పరిశోధక విద్యార్థి పోలిరెడ్డి శ్యామ్ కుమార్‌కు అరుదైన అవకాశం దక్కింది. జాతీయ యువజనోత్సవాలలో భాగంగా వచ్చేనెల 12న దేశ రాజధాని ఢిల్లీలో భారత్ మండపంలో నిర్వహించే 'స్కాట్ వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' కార్యక్రమంలో పాల్గొనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీతో ప్రజాస్వామ్యం - ప్రభుత్వంలో యువత పాత్ర అనే అంశంపైన తన ఆలోచనలను పంచుకుంటారు. ఈ సందర్భంగా పోలిరెడ్డి శ్యామ్ కుమార్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విభాగపు గైడ్ ఆచార్య పి.సునీత పాల్గొన్నారు

గీతం పరిశోధక విద్యార్థి రవి విఠల్‌కు డాక్టరేట్

వస్త్ర పరిశ్రమలో కాలుష్య నివారణపై అధ్యయనం



రవి విఠల్ కందిశ

ప్రజాశక్తి-మధురవాడ : వస్త్ర పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థాల వల్ల ఏర్పడుతున్న జలకాలుష్యం నివారణకు జరిపిన పరిశోధనలకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ టెక్నాలజి బయోటెక్నాలజీ విభాగం పరిశోధకుడు డాక్టర్ రవివిఠల్ కందిశకు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. వస్త్ర పరిశ్రమలలో సింథటిక్ రంగులను ముఖ్యంగా మిథైల్ బ్లూ, మాల్‌చైట్ గ్రీన్ రంగులను వాడటం వల్ల అవి పారిశ్రామిక వ్యర్థాలుగా మారి, పరిశ్రమల సమీపంలోని నీటి వనరులను కాలుష్యానికి గురుచేస్తున్నాయని డాక్టర్ రవి తెలిపారు. జలరాశులతో పాటు మానవాళికి సైతం ప్రమాదకరంగా పరిణమించిన ఈ సింథటిక్ రంగులను శుద్ధి చేయడానికి విజ్ఞా ట్రిలోబాట పేరుతో లభించే పదార్థాన్ని తన పరిశోధనల ద్వారా గుర్తించానని, దీని ద్వారా వస్త్ర పరిశ్రమలు ప్రమాదకర రసాయనాలను తమ ఫ్యాక్టరీ నుంచి బయటకు విడుదల చేసే సమయంలో శుద్ధి చేసి విడుదల చేయడం ద్వారా కాలుష్య తీవ్రత తగ్గుతుందని వివరించారు. బయోటెక్నాలజి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె.వి నారాయణ సాయిబాబా మార్గనిర్ధేకత్వంలో పరిశోధన జరిపినట్లు డాక్టర్ రవి విఠల్ తెలిపారు.

బాలల సంరక్షణ కేంద్రంలో కల్యాణ్ పడాల

ప్రజాశక్తి -తగరపువలస: భీముని పట్నం మండలం తాళ్లవలస పంచాయతీలోని భరోసా లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రాన్ని బిగ్ బాస్ 9 తెలుగు విజేత కల్యాణ్ పడాల సందర్శించారు. పిల్లలతో కళ్యాణ్ పడాలకు మంచి అనుబంధం ఉందని నిర్వాహకులు వెంపాడ శ్రీనివాసరెడ్డితెలిపారు. కళ్యాణ్ మాట్లాడుతూ భగవంతుడు ఆశీస్సులు అభిమానులు సహకారంతో బిగ్ బాస్ 9తెలుగు విజేతగా నిలిచానన్నారు. అనంతరం పిల్లల మధ్య కేక్ కటింగ్ చేసి పిల్లలకు భోజనం సమకూర్చారు.

బోగస్ కుల ధ్రువపత్రాలు రద్దుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-జికెవీధి: మండలంలోని రింతాడ గ్రామానికి తోలుబొమ్మలాట వృత్తితో వలస వచ్చి స్థిరనివాసం ఉంటున్న జర్తా, చెదల ఇంటిపేర్లతో ఎస్టీ నూకదొర ఉపతెగగా చెలామణి అవుతున్న బోగస్ షెడ్యూల్ తెగ ధ్రువీకరణ పత్రం రద్దు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేయగా, ఈ విషయమై అక్టోబర్ 18న రింతాడ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ అధికారి గ్రామపెద్దల సమక్షంలో సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో జర్తా సత్తిబాబు తండ్రి నూకరాజు, నూకదొర, చెదల రమణబాబు ఎస్టీ నూకదొర కులం పేరుతో బోగస్ కులధ్రువీకరణ పత్రం పొందినట్టుగా ఉపసర్పంచ్ సోమేష్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వారికి కొంత సమయం ఇవ్వాలని కోరగా వారికి 30 రోజుల సమయం ఇచ్చారు. వారి నుంచి ఏ విధమైన నిర్ధారణ చేసుకునేందుకు ఎటువంటి ధ్రువపత్రాలు సమర్పించనందున వారి కులధ్రువపత్రాలు రద్దు కోసం జిల్లా కలెక్టర్‌కు ఆర్‌సి నెంబర్ 329/2025/ఎస్ఎతో ఈ నెల 24న చర్యలు తీసుకొనుటకు డిఎల్ఎస్‌సి కమిటీకి ప్రతిపాదనలు పంపామని తహశీల్దార్ అన్నాజీరావు(ఎండార్స్‌మెంట్) శుక్రవారం రింతాడ గ్రామ రెవెన్యూ అధికారి కృష్ణారావు ద్వారా ఉపసర్పంచ్ సోమేష్‌కుమార్‌కు అందజేశారు.

అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధిగా కొర్రు రామమూర్తి

ప్రజాశక్తి-కొయ్యూరు: అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధిగా తనను నియమించడంపై టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్‌కు టిడిపి నేత కొర్రు రామమూర్తి ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసినందుకు తగిన గుర్తింపు లభిస్తుందని దీనికి తానే ఉదాహరణ అన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నియోజకవర్గ నాయకులు, కొయ్యూరు మండల టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

డిప్యూటీ డిఎంహెచ్ఒ పుల్లయ్యను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి- చింతూరు: డిప్యూటీ డిఎంహెచ్ఒ పుల్లయ్య వైఖరి వల్ల ఇబ్బందులు పడుతున్నామని బహిరంగంగానే వైద్యులు ఫిర్యాదు చేస్తుంటే ఎమ్మెల్యే కనీసం స్పందించకపోవడం దురదృష్టకరం అని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రంపచోడవరం చింతూరు ఐటిడిఏ పరిధిలో డిప్యూటీ డిఎంహెచ్ఒగా పనిచేస్తున్న డాక్టర్ పుల్లయ్య ఒకే చోట బదిలీ లేకుండా ఎన్నో సంవత్సరాలుగా కొనసాగడం, డాక్టర్లను వేధించడం, భద్రాచలంలో స్వంతంగా రాధాకృష్ణ ప్రైవేటు హాస్పిటల్స్ నడుపుతూ కేసులు అక్కడికి రిఫర్ చేయడం వంటి ఆరోపణల నేపథ్యంలో వైద్యులు ఫిర్యాదు చేసినా అతని మీద చర్యలు తీసుకోవడం లేదని అతన్ని సస్పెండ్ చేయాలని లోతా రామారావు డిమాండ్ చేశారు.


సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- కొయ్యూరు: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ సిఐ వెంకటరమణ సూచించారు. శుక్రవారం కొయ్యూరు కెజిబివి, కాకరపాడు గురుకుల జూనియర్ కళాశాలలో సిఐ శ్రీనివాసరావుతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్లు ఉన్నవారు ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి అనుమానం వచ్చినా సంబంధిత దగ్గర్లో ఉన్న పోలీసులకు సమాచారం అందిస్తే అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు.

మంప ఎస్ఐగా శ్రీనివాస్ బాధ్యతలు

ప్రజాశక్తి-కొయ్యూరు: మంప పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా సీదరి శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సై ముందుగా కొయ్యూరు సిఐ బి.శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కానిస్టేబుళ్లు, సిబ్బంది ఎస్సైను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన శంకరరావు అనంతగిరి పోలీసు స్టేషన్‌కి బదిలీపై వెళ్లారు.

సీలేరుకు పర్యాటకుల తాకిడి



సీలేరు మెయిన్‌డాం వద్ద పర్యాటకులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో శుక్రవారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. సీలేరు పరిసర ప్రాంత అందాలను తిలకించేందుకు ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల నుంచి పర్యాటకులు తండోపతండాలుగా తరలివచ్చి క్యూ కట్టారు. స్థానిక జల విద్యుత్ కేంద్రం ఇంటెక్ డ్యామ్ రెగ్యులేటరీ డ్యామ్ మెయిన్ డ్యాం జలపాతాలు అంద చందాలు చూసి పులకించిపోయారు. సీలేరు పరిసరాల్లో ఉన్న సిద్ధంగా ఉన్న ఎత్తైన కొండలు, పచ్చని అడవులు సహజసిద్ధమైన అందాలను ఆస్వాదించారు. ఒకపక్క ప్రకృతి అందాలు, మరోపక్క మంచు అందాలు తనివితీర తిలకించి పర్యాటకులు మంత్రముగ్ధులయ్యారు. సీలేరు సమీపంలో ఉన్న ఐస్‌గెడ్డ జలపాతాలు, దారకొండ ఘాట్‌రోడ్లో జాలువారే జలపాత వంటి దృశ్యాలను చూసి ఎంతో అనుభూతిని పొందారు. అనంతరం పర్యాటకులు దారకొండ గూడెం చింతపల్లి ప్రాంత ప్రధాన రహదారి పొడవునా అందాలను తిలకించారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి సాయిప్రశాంత్

ఫిర్యాదుదారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

దేవీపట్నం- ప్రజాశక్తి: ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిఎస్పి సాయిప్రశాంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. దేవీపట్నం పోలీస్‌స్టేషన్‌ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులు తనిఖీ చేశారు. వివిధ కేసులు, వాటి వివరాలను ఎస్సై షరీఫ్‌ని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సైబర్ క్రైం, ఆన్‌లైన్ రుణాలు, బాల్య వివాహాలు నిరోధించే విధంగా తీసుకునే చర్యలు వంటి విషయాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. స్టేషన్‌కి వచ్చే వారి పట్ల మర్యాద పూర్వకంగా ఉండాలని, వారి సమస్య తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. సిబ్బందికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామని డిఎస్పీ చెప్పారు. ఎస్ఐ షరీఫ్, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

శ్రమదానంతో గోతుల పూడ్చివేత

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని ఒడ్డుగూడెం పంచాయతీ లో ఒడ్డిగూడెం కాలనీ నుండి ఒడ్డిగూడెం వెళ్లే రహదారి గోతులు పడి వారంతా అవస్థలు పడుతున్నారు. వాహనాలు తిరిగే పరిస్థితి కూడా లేదని ఎన్నోసార్లు అధికారులు, నాయకుల దష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవట్లేదని ఒడ్డుగూడెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై గూడెం గ్రామయువత శుక్రవారం గోతులు పూడ్చారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి రహదారి బాగుచేయాలని కోరుతున్నారు.



గోతులు పూడ్చుతున్న యువకులు



ఆలయ ప్రాంగణంలో తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

తెప్పోత్సవానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి- విఆర్‌పురం: మండలంలోని శ్రీరామగిరి సుందర సీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం గోదావరి ఒడ్డున మెట్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను సర్పంచ్ పులి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి తీరాన అధిక సంఖ్యలో భక్తులు పుణ్య స్నానా లు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రతా చర్యలు తీసుకోవాలని నదిలో తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నూతన పాలకమండలి, ఆలయ కమిటీ అధికారులు గ్రావుస్తుల సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, ఉన్నతాధికారులు సహాయ సహకారాలు కోరామన్నారు. భక్తులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకుంటామన్నారు.ఉప సర్పంచ్ కొడిచల దుర్గారావు, మాజీ ఉపసర్పంచ్ గుండెపూడి లక్ష్మణరావు, పోడియం శ్రీరామమూర్తి, కమ్మచిచ్చు సత్యనారాయణ పాల్గొన్నారు.

ధాన్యం సంచుల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు శుక్రవారం ధాన్యం నింపే గోనె సంచుల కోసం గంటల తరబడి క్యూలో నిలబడి ఎదురు చూశారు. అవసరం మేరకు సంచులు సరఫరా చేయాలని పలువురు రైతులు అధికారులను కోరారు. శుక్రవారం ఇక్కడ 1,500 సంచులు ఇచ్చామని, శనివారం మరో 5 వేలు ఇస్తామని వ్యవసాయ అసిస్టెంట్ శివ తెలిపారు. మండలానికి1.12 లక్షల సంచులు అవసరం కాగా ఇప్పటి వరకు 65 వేలు ఇచ్చినట్లు ఎఒ చక్రధర్ తెలిపారు.

మనమిత్ర యాప్ సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ప్రభుత్వ సేవల కోసం మీసేవ సచివాలయాలు, చుట్టూ తిరిగే పని లేకుండా ప్రభుత్వం మన మిత్ర యాప్ తీసుకొచ్చిందని ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరావు తెలిపారు. శుక్రవారం శరభవరం పంచాయతీ పరిధిలో మనమిత్ర క్యాంపెయిన్ నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ 9552300009 నెంబర్‌కు మెసేజ్ చేస్తే అన్ని రకాల సేవలు పొందవచ్చని తెలిపారు. ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.